క్లుప్తంగా

వినాయకునికి గరిక పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ సమీపంలో కొలువుతీరిన సిద్ధి వినాయకునికి బుధవారం గరిక పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని వరసిద్ధి వినాయకస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. రాత్రి భజన జరిగింది.

ఒకటిన మండల సర్వసభ్య సమావేశం

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జ్యోతిర్మయి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం మొదటి అంతస్తులోని మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులతో పాటు సభ్యులందరూ తప్పక హాజరుకావాలన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



గోకవరంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి

గోకవరం: ఎరువులు, విత్తనాలు విక్రయించే షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లవరం, గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు లాట్ నెంబరు వేసిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఓ రాజరాజేశ్వరి, వీఏఏలు, వీహెచ్‌ఏలు ఉన్నారు.

సత్యసాయి యూనియన్ కమిటీ ఎంపిక



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయ్, మెయింటినెన్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా కట్టమూరి వీరబాబు, ఉపాధ్యక్షులుగా పాలాడి శ్రీను, ఇజ్జిన శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ఉందిర్తి ఇస్సా, వైస్ జనరల్ సెక్రటరీలుగా కట్టంగి మల్లేశ్వరరావు, జొన్నల సురేష్, ట్రెజరర్‌గా కాళ్ల రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరికీ అండగా ఉంటామన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. బకాయి జీతాలను రాబట్టడానికి తగు ప్రయత్నాలు చేస్తామన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్య మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. జీఆర్పీ ఎస్సై లోవరాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి రాజమహేంద్రవరం– కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య చనిపోయి ఉన్నాడు. రైల్వే పోలీసులు ఆ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రిలోని మార్చురీ రూమ్‌కు తరలించారు. కాగా.. ఆ ఘటనకు సంబంధించిన వార్త బుధవారం ‘సాక్షి’ పత్రికలో వచ్చింది. దానిని మృతుడి బంధువులు చదివి.. స్టేషన్‌కు వచ్చారు. మృతుడు రాజమహేంద్రవరానికి చెందిన సరగడ భరణి వెంకట రాధాకృష్ణ (35)గా గుర్తించారు.

30న అగస్త్యేశ్వరాలయ వార్షికోత్సవం

కడియం: దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరాలయ 12వ వార్షికోత్సవాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్టు భక్త బృందం తెలిపింది. బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి, కంతం వినాయక శర్మ, పూజ్యం కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

పోషణతోనే పాడి వృద్ధి

- మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పశువులు

బిక్కవోలు: వ్యవసాయంతో పాటు పశుపోషణ గ్రామాలలో ప్రధాన వృత్తిగా ఉంటుంది. పాడి రైతులు తమ పశువులను సొంత బిడ్డల మాదిరిగా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం సీజన్ మారుతోంది. నెమ్మదిగా వర్షాలు మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలనే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం అందజేయాలి. అప్పుడు పశు సంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, నీరు అవసరమని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తికి..

పశువుల పెరుగుదలకు, రోగనిరోధకశక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

దెబ్బల నుంచి రక్షణ

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు అత్యంత అవసరం

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శీరర జీవన ప్రక్రియకు , ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీహ సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి , జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంస కృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువుల డీహైడ్రేషన్ గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
అనపర్తి	1,256	8,644	2,954	621
బిక్కవోలు	1,203	5,798	8,969	1,707
రంగంపేట	7,623	11,045	3,269	3,123
పెదపూడి	1,557	8,025	22	485
మొత్తం	11,639	33,512	15,214	5,936

వానాకాలంలో జాగ్రత్తలు



వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే చిటిక, నీలి నాలుక,పారుడు, కాళ్ల డెక్కల, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేయాలి. అప్పుడే వాటిని న్యూమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వాటిని సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. ఒక వేళ గొర్రె, మేక మృతి చెందితే దానిని ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చిపెట్టాలి. మూగ జీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ ఏడీ,అనపర్తి

క్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి నెలకొంటుందని రోమన్ కథోలిక సంఘం ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి మెయిన్‌రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులు నిజమైన ప్రవక్తలను ఎంపిక చేసుకోవాలని, తద్వారానే మంచి బోధనలు వెల్లడవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి ఉపదేశి రాయి థోమాస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

పెదపూడి: బాల్య వివాహ నిర్మూలనా చట్టాలపై ప్రజలకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని అంగన్‌వాడీ కేంద్రాల పెదపూడి సెక్టార్ సూపర్ వైజర్ శ్రీగౌరీ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. తల్లుల, కిశోర బాలికలు, బాలురతో సమావేశమయ్యారు. బేటీ బచావో బేటీ పడావో (బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం)పై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కిట్ల పంపిణీ జరిగింది. మండల విద్యాశాఖాధికారులు కుశలవదొర, సుజాత ఆధ్వర్యంలో వీటిని అందించారు. మండల కేంద్రానికి చేరిన కిట్లను మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు దగ్గరైతే అనేక అనర్థాలు



కోరుకొండలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు , అధికారులు

రాజానగరం: మత్తు పదార్థాలకు దగ్గరైతే అనేక అనర్థాలు కలుగుతాయని, జీవితాలను, కుటుంబాలను నాశనం చేసే మత్తుకు దూరంగా ఉంటూ, ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని సుఖమయ జీవితం గడపాలని ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాలు, రవాణాకు వ్యతిరేకంగా మండలంలోని దివాన్ చెరువు వీజేస్ ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను అరికట్టడంలో యువత ముఖ్య భూమికను పోషించాలన్నారు. యువత తలచుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదని, అది సమాజ హితంగా, సభ్య సమాజం హర్షించే విధంగా ఉండాలన్నారు. క్షణికానందం కోసం మత్తుకు చేరువైతే మీ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. స్వార్థపరుల ప్రలోభాలకు లొంగవద్దని, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దన్నారు. అపరిచితులతో స్నేహం అపాయానికి దారితీస్తాయనే విషయాన్ని ఎన్నడూ మరువరాదన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్టుగా తెలిసినా, విక్రయిస్తున్నట్టు సమాచారం ఉన్నా తక్షణమే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బొమ్మూరు సీఐ ఉమర్ అబ్దుల్లా, కళాశాల చైర్‌పర్సన్ ఎస్. శకుంతల, కరస్పాండెంట్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



దివాన్‌చెరువులో మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్ కుమార్



గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

డ్రగ్స్ రహిత సమాజంతో అభివృద్ధి

మధురపూడి: డ్రగ్స్ రహిత సమాజంతోనే అభివృద్ధి సాధ్యమని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కోరుకొండ సీఐ బంగారురాజు అన్నారు. మత్తు పదార్థాలు లేని సమాజం కోసం బుధవారం కోరుకొండలో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగానుగూడెంలోని సృజన కాలేజీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా కోరుకొండ బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. సెబ్ సీఐ బంగారు రాజు మాట్లాడుతూ యువత దురలవాట్లకు గురైతే సమాజంలో అశాంతి నెలకొంటుందన్నారు. మత్తు పదార్థాలు చాలా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై వంశీరామ్, కోరుకొండ ఎస్సై ఆనంద కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గోకవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గోకవరం ఎస్‌ఐ కె.నాగరాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల అభ్యున్నతి



అంగన్‌వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అధికారులు

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పెదపూడి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ శ్రీ గౌరీ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని మెయిన్ రోడ్డు ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పెద్దాడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 40 మంది చిన్నారులను సమీప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. అలాగే పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు, పట్టా ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీవీవీ సత్యనారాయణ, సంపర సెక్టార్ సూపర్ వైజర్ పద్మావతి, ఉపాధ్యాయులు, వెంకటరెడ్డి, రామారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి



రంగంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: అధికారులందరూ జవాబుదారీతనంతో పనిచేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి, ఇరిగేషన్, వ్యవసాయం, విద్యుత్తు, రోడ్లు నిర్మాణం వంటి తదితర విషయాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వీటి మీద సమీక్ష నిర్వహించి, పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీఓ శ్రీరామరాజు, ఎంఈఓలు శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఈఓపీఆర్డీ వెంకటరత్నం పాల్గొన్నారు. అలాగే మండలంలోని రెండు ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ పెదరాయవరం నుంచి ముకుందవరం మీదుగా జి.దొంతమూరు వరకు రూ.3.50 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డుకు, రంగంపేట నుంచి దొడ్డిగుంట మీదుగా సింగంపల్లి వరకు రూ.3 కోట్లతో మరో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రంగంపేటలోని శివాలయం అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

చకచకా సాగుతూ..



దుళ్లలో సిద్ధం చేసిన నారుమడి

- వడివడిగా తొలకరి పనులు
- బిజీగా అన్నదాతలు

కడియం: మండలంలో తొలకరి పనులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన కడియంతో పాటు, వేమగిరి, జేగురుపాడు, మాధవరాయుడు పాలెం, మురమండ, దుళ్ల, కడియపుసావరం గ్రామాల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఆకుమడులు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం తొలిదశ దమ్ములు విస్తృతంగా సాగుతున్నాయి. మండలంలోని ఆరు గ్రామాల్లోనూ మొత్తం 4,900 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారని వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేశారు.

ప్రధానంగా రెండే రకాలు

తొలకరిలో మండలంలో ప్రధానంగా రెండు రకాల వరినే రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాలను రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. రబీ విత్తనాలకు ఎంటీయూ 1121ని కూడా కొందరు రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం 210 ఎకరాల్లో వరి నారుమడులను రైతులు సిద్ధం చేసుకున్నారు.

భూసారాన్ని బట్టే వాడాలి

వరిసాగు చేసే రైతులు భూసారాన్ని అనుసరించే ఎరువులు వాడాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి స్పష్టం చేశారు. అనవసరంగా ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తే రైతులకు పెట్టుబడులు పెరిగిపోవడం తప్పితే ఎటువంటి ఉపయోగం ఉండదని గుర్తించాలన్నారు. దమ్ము పూర్తయ్యాక డీఏపీ, జింక్‌ను వేసుకునే రైతులు ఈ రెండింటినీ విడివిడిగా 24 గంటల వ్యవధిలో మాత్రమే పంటకు అందించాలన్నారు. రెండూ కలిపి వినియోగిస్తే పంటకు నష్టమే ఎక్కువని గుర్తు పెట్టుకోవాలని ఏవో తెలిపారు. నాట్లు వేయడానికి 15 రోజుల ముందే దమ్ము చేయాలన్నారు.

అలాగే నాట్లు వేసేందుకు వినియోగించే వరి నారుకు ముప్పై రోజులు వయసు ఉండాలని, నాలుగు నుంచి ఆరు ఆకులు ఉండేలా చూసుకోవాలన్నారు. చదరపు మీటర్‌కు 33 మూనలు ఉండే విధంగా రబీలో నాట్లు వేసుకోవాలన్నారు. ఎక్కువ వయసు గల నారును వినియోగిస్తే దిగుబడి తగ్గుతుందని గమనించాలన్నారు. దమ్ములోనే 50 కేజీల డీఏపీ వేసుకోవాలన్నారు. మొత్తం పంట కాలానికి వంద కేజీలు మాత్రమే మూడు దఫాలుగా యూరియాను వినియోగించాలన్నారు. ఎంవోపీ 25 కేజీలు చిరుపొట్టదశలో మాత్రమే వాడాలన్నారు.

సారా అమ్మకాలు అరికట్టాలి



సారా అమ్మకాలను అరికట్టాలని కోరుతున్న మహిళలు

సీతానగరం: సారా విక్రయాలను అరికట్టాలని ఎస్సై టి.రామకృష్ణకు రఘుదేవపురం వడ్డీలపేటకు చెందిన మహిళలు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సారా తాగి వడ్డీలపేటకు చెందిన చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువకులు ఆ మహమ్మారికి బానిసలు అవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సారా అమ్మకాలు అరికట్టాలని కోరారు.

హెచ్‌ఐక్యూ ఫార్మా ల్యాబ్‌తో ఒప్పందం

కంబాలచెరువు: హెచ్‌ఐక్యూ ఫార్మా ల్యాబ్స్‌తో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సూక్ష్మ జీవశాస్త్ర (మైక్రో బయాలజీ) విభాగం మూడేళ్ల పాటు అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే బుధవారం తెలిపారు. హెచ్‌ఐక్యూ ఫార్మా ల్యాబ్స్ అనే ఫార్మా,హెల్త్ కేర్ సంస్థ హైదరాబాద్, రాజమహేంద్రవరాలలో పనిచేస్తోందన్నారు. మందుల తయారీ, శిక్షణ, మందుల నాణ్యతా పరీక్షా పద్ధతులు, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అతిథి ఉపన్యాసాలు, ప్రయోగశాలల నిర్వహణ తదితర వాటిలో సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ విభాగాధిపతి టి.సోనీ, అధ్యాపకురాలు డాక్టర్ టి.సుజాతలను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి సహకరించండి



ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను కలిసిన సంఘ ప్రతినిధులు

కంబాలచెరువు: పొరుగు సేవలు, ఒప్పంద విధానంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా జీజీహెచ్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తుందని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి శ్యామ్‌కుమార్, సుధాకర్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన తమ సంఘాన్ని గురువారం ప్రభుత్వాసుపత్రి అధికారులకు పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభను ఆసుపత్రిలో కలిసి, సంఘ లక్ష్యాలను వివరించి, ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలని కోరారు. సంఘం ప్రభుత్వ గుర్తింపు పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. నూతన సంఘం ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్‌ఎంవో డాక్టర్ ప్రణవ్, మేనేజర్ కేదార్, పరిపాలనాధికారి శ్యామ్ సుందర్‌ను కలిశారు. కార్యక్రమంలో దారా చంద్రశేఖర్, కుశ రాజు, అవినాష్, రమణ పాల్గొన్నారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: డీజిల్ పొదుపు, ఆదాయం పెంపుతోనే ఆర్టీసీ ప్రగతి సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ప్రతి నెలా మాదిరిగానే బుధవారం ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ మే నెలలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన, డీజిల్‌ను పొదుపు చేసిన డ్రైవర్లు, కండక్టర్లను సత్కరించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆనం కళాకేంద్రంలో ఎల్‌సీడీసీ శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ఆనం కళాకేంద్రంలో బుధవారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) జరిగింది. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, టీబీ ఆఫీసర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ జూలై 18 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకూ ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి శిక్షణ ఉంటుందన్నారు. లెప్రసీ లక్షణాలు, గుర్తించే విధానం, బాధితులకు అందించాల్సిన వైద్యంపై జాగ్రత్తలను వివరించామన్నారు. కొవ్వూరు డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.సంధ్య, డీఎస్ఎంవో పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.